## సింగిల్ పేజీ కథలు

# పుట్టినిల్లు

"చూడు జానకీ! నేను ముప్ఫయి ఏళ్లుగా చెబుతూనే వున్నాను. మీ పుట్టినింటి అలవాట్లన్నీ అక్కడితో మరచిపొమ్మనీ, యిక్కడ వద్దు అనీ. నువ్వు మాత్రం మారనే మారవా?" కోపంగా అన్నాడు గోపాల్.

"ఏం మాట్లాడుతున్నారు మీరు? నేనూ చెబుతూనే వున్నాను, మాటిమాటికీ మా పుట్టినింటి గురించి హేళనగా మాట్లాడవద్దని. ఏం? మా అలవాట్లకేమొచ్చింది? ఏం కష్టపడిపోతున్నారు మీరు?" యుద్ధానికి సిద్ధమైంది జానకి.

"ఏమిటని అడుగుతున్నావా మళ్ళీ? ఉదయం ఏడెనిమిది గంటలదాకా మంచం దిగకపోవడం ఎవరి అలవాటో మరి. మా అమ్మ అయిదు గంటల తరువాత నిద్ర లేచింది ఎప్పుడైనా చూశావా? రాత్రి పది గంటలకల్లా పడుకుంటూనే వున్నారు కదా! మరి అంత నిద్ర చాలకపోతుందా?" వేడిగా సమాధానమిచ్చాడు గోపాల్.

"కొద్దిగా ఆలస్యంగా నిద్రలేవడమే పెద్ద క్షమించరాని నేరమా? మీరు రాత్రుళ్ళు తొమ్మిది గంటలకు పైన యిల్లు చేరడం వల్లనే కదా పడుకోవడానికి పది గంటలు అవుతోంది. మీ నాన్నగారికి పెందరాళే యిల్లు చేరుకునే అలవాటు కాబట్టి అత్తయ్యకు కాచుకూర్చునే అవసరం లేకపోయింది. అంతమాత్రం అర్థం కాదా మీకు?"

"అది ఒక్కటేనా ఏమిటీ? రాత్రి పడుకోబోయేముందు అంట్ల గిన్నెలూ అవీ తోమిపెట్టి, పడుకోవడానికి పోవచ్చుగదా! అన్ని గిన్నెలనూ, పాత్రలనూ చేర్చిపెట్టి వుదయాన్నే వాటిని ముందేసుకుని పెరట్లోనే వుండిపోతే మిగిలిన పనులెలా అవుతాయి? ఇప్పుడు టైం తొమ్మిదవుతోంది. ఈరోజు ఆదివారం కాబట్టి సరిపోయింది. లేకుంటే నేను సమయానికి ఆఫీసుకు బయలుదేరగలిగేవాడినా? ఇంతవరకూ కాఫీ నీళ్ళకు గతిలేదు. పెద్దగా మాట్లాడుతున్నావు" కోపం ఎక్కువవుతూ వచ్చింది గోపాల్‌కు.

"చూడండీ! అంట్లగిన్నెలు తోముకోవడం, వాకిలి వూడ్చడం లాంటివన్నీ ఆడవాళ్ళకు సంబంధించిన పనులు. ఆ పనులు ఎప్పుడు చేయాలో మీరు చెప్పబూనుకోవడం సిగ్గుచేటు" కసరినట్టు అంది జానకి.

"నాకు సంబంధించిన పనులు ఆలస్యమవడానికి కారణం చెబుతున్నాను. అంతేకానీ నీ అంట్లగిన్నెల గురించి నాకేం అంత ఆసక్తిలేదు" వెటకారంగా అన్నాడు గోపాల్.

ఇక సహించలేకపోయింది జానకి.

"ఇలా కూర్చుంటే తప్పు, నిల్చుంటే తప్పు అంటూ వుంటే నేను ఈ సంసారం చేయలేను. చాలండీ ఈ ముప్ఫయి ఏళ్లుగా నేను యీ యింట్లో అనుభవించిన సుఖం. ఇక నాకు శక్తి లేదు. నేను మా పుట్టినింటికి వెళ్తున్నాను. మీ సంసారం మీరు చూసుకోండి" అని



కళ్ళు తుడుచుకుని బట్టలైనా మార్చుకోకుండా బయలుదేరింది జానకి.

ఇలా జరుగుతుందని కొంచెమైనా వూహించని గోపాల్ "జానకీ" అని వెంబడించేలోగా ఆటో ఎక్కేసింది.

* * *

"ఇకపైన ఒక్కక్షణం కూడా నేను ఈ యింట్లో వుండలేను. నేను మా పుట్టినింటికి వెళ్తున్నాను. మీరు మీ అమ్మనే పూజ చేస్తూ కూర్చోండి. మాట్లాడితే చాలు, మా పుట్టినింటిని తప్పు పట్టడమే పని అయిపోయింది మీకు" ఒక బ్రీఫ్‌కేసులో రెండు జతల బట్టలు కుక్కుకుంటూ అంది రమ.

"సరే, వెళ్ళు... నిన్ను వుండమని ఎవరూ బలవంతం చేయడం లేదు. మొదట పెద్దవారిని గౌరవించడం నేర్చుకుని మళ్ళీ రా" అన్నాడు సురేష్ అలక్ష్యంగా.

విసురుగా వాకిలివైపు అడుగులు వేసిన రమ, అప్పుడే లోనికి వస్తున్న జానకిని చూడగానే "అమ్మా! ఇక్కడ వుండటం నావల్ల కాదు. ఈ యింట్లో పద్ధతులేవీ నాకు సరిపడవు, పద పోదాం" అంది.

"మీ అమ్మనే చెప్పమను ఈ యింట్లో ఏ పద్ధతులు సరిలేవో" అన్నాడు సురేష్ జానకిని చూసిన ధైర్యంతో.

జానకికి ఒక్కక్షణం నోట మాట రాలేదు.

కాస్త తేరుకున్నాక, "రమా! ఏమిటే యిది? ఇక్కడ ఏం జరిగింది అన్న విషయం పక్కన పెట్టు. అత్తగారింట్లో అటూ యిటూ వున్నా సర్దుకుపోవాలి తప్పితే మాటిమాటికీ అలిగి పుట్టినింటికి బయలుదేరడం మంచి పని కాదు. లోపలికి రా! నేనేదో బజారుకు వెళ్తూ వెళ్తూ మిమ్మల్ని చూసి పోదామని యిలా వస్తే యిక్కడ ఈ భాగోతం" అంది విసుగ్గా.

అంతలో స్కూటర్ శబ్దం విని తిరిగి చూసింది. వాకిలి ముందు స్కూటర్‌ను నిలిపి స్టాండ్ వేస్తూ కనిపించాడు భర్త గోపాల్.

"అరె! ఆలస్యమైపోయింది, ఏవండీ వెళ్దామా?" అని భర్తతో చెప్పి యిటు తిరిగింది. "నువ్వయినా దానితో కాస్త సర్దుకుపోరాదా సురేష్!" అని తమ్ముణ్ణి మెత్తగా మందలించి, "అమ్మా నాన్నా ఎక్కడ? ఓహో వాళ్ళు గుడికి వెళ్ళే సమయం కదూ యిది! సరే, నేను వచ్చి వెళ్ళానని చెప్పండి" అని వచ్చి స్కూటర్‌పై భర్త వెనుక కూర్చుంది జానకి.

కూతురు రమను తమ్ముడు సురేష్‌కు యిచ్చి పెళ్లి చేసిన జానకి వేరే ఏం మాట్లాడగలదు? కూతురి మెట్టినిల్లే తనకు పుట్టినిల్లు మరి! ఆ యింటిని తక్కువ చేసి మాట్లాడగలదా!

నవ్వుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు గోపాల్.

**-ఆర్.వి.చలపతి** (సెంగుట్టాయి)